క్లుప్తంగా

రెంజల్‌లో ఒకరికి డెంగీ



రెంజల్(బోధన్): రెంజల్ మండల కేంద్రంలో ఒకరికి డెంగీ వ్యాధి నిర్ధారణ కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. బుధవారం రోగి ఇంటి వద్దకు చేరుకుని పేరి డొమెస్టిక్ సర్వే నిర్వహించారు. వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ వినయ్‌కుమార్ అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావ్, ఆరోగ్య విస్తరణ అధికారి చింతల శ్రావణ్ కుమార్, సిబ్బంది విజయ, చిన్నయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంబరాల్లో పాల్గొనాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం పంట రుణమాఫీ చేయనున్న సందర్భంగా గురువారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో జరిగే సంబరాల్లో రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిసెరం భూమేశ్‌రెడ్డి కోరారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డిలు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం జరిగే బైక్‌ర్యాలీలో పాల్గొని డొంకేశ్వర్ రైతువేదికలో జరిగే రుణమాఫీ ప్రారంభోత్సవానికి రైతులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మాజీ ఎంపీపీకి సన్మానం



నందిపేట్ (ఆర్మూర్): ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న నందిపేట మాజీ ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డిని బుధవారం నందిపేట మండలంలోని వన్నెల్ కే గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పదవి కాలంలో సంతోష్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి లలిత, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లోక హనుమాండ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పద్మశాలి సంక్షేమ సేవ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా పద్మశాలి కుల న్యాయవాదులను ఘనంగా సత్కరించారు. ఆర్మూర్ కోర్టులో ప్రజలకు న్యాయ సేవలందిస్తున్న న్యాయవాదులు సిలివేరి శ్రీధర్, బోట్ల జీవన్, జక్కుల శ్రీధర్, చిలుక కిష్టయ్య, బేతు జగదీష్, ద్యావర శెట్టి అరుణ్‌లకు సన్మానించారు. సమితి అధ్యక్షుడు మ్యాక మోహన్ దాస్, ప్రధాన కార్యదర్శి కొక్కుల రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



రుద్రూర్: బొప్పాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజును బాన్సువాడ పట్టణంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఓబీసీ జిల్లా కార్యదర్శి పట్ల సురేష్ ఆధ్వర్యంలో బాలరాజ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కుర్మాజీ సాయిలు, దత్తు, నవీన్, అబ్బయ్య, గంగారాం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకే మొక్కలు



వర్ని: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బోధన్ రేంజ్ ఎక్సైజ్ ఎస్సై జలీల్ వెల్లడించారు. బుధవారం వర్ని గ్రామ శివారులో హరితహారంలో భాగంగా గౌడ సంఘం నాయకులతో కలిసి ఎస్సై జలీల్ మొక్కలు నాటారు. వర్నిలో 15 వందల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. ఎక్సైజ్ అధికారులు సుదర్శన్, విజయేందర్, గౌడ సంఘం నాయకులు శ్రీరామ్ సాయ గౌడ్, ధర్మగారి రాజగౌడ్, అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి

జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశి పండుగను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాలు చేపట్టారు. ఆలయాలను దర్శించుకున్న ప్రజలకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



రుద్రూర్ రుక్మిణీ విఠలేశ్వర స్వామి ఆలయంలో..



ఆర్మూర్‌టౌన్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



మాక్లూర్: పాండురంగ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తాకు ఆశీర్వాదం





డొంకేశ్వర్ రామాలయంలో హోమం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బోధన్‌టౌన్(బోధన్): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రైతులు పెట్టుబడి కోసం తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ డల్లా సురేష్ మాట్లాడారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. మండల అధ్యక్షుడు కంగేకర్ గంగాధర్, నాయకులు సాయిలు, తిరుపతి, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



బోధన్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నాటుడు.. నరుకుటకేనా?

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- హరితహారంలో నాటిన మొక్కలే టార్గెట్

బాల్కొండ: హరితహారంలో భాగంగా రోడ్ల వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో ప్రభుత్వం మొక్కలను నాటింది. అలా నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. అలాంటి చెట్లను గ్రామాల్లో వీడీసీలు, ఇతర కమిటీలు నరికేసి కుప్పలు వేసి కుప్పల లెక్క చొప్పున టెండర్లు నిర్వహిస్తున్నారు. అసలు మొక్కలు నాటింది నరకటానికేనా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ లైన్‌ల కింద తీగలు తగులుతున్నాయంటూ చెట్లను నరుకుతున్నారు. దీంతోనే సగం చెట్లు ఖాళీ అవుతున్నాయి. దానికి తోడు రైతులు తమ పంట పొలాలకు నీడ వచ్చి పంటలు ఎదగడం లేదని రోడ్ల వెంబడి ఉన్న చెట్లను నరికివేస్తున్నారు. ఇప్పుడు వీడీసీలు చెట్లను నరికి కట్టెలను టెండర్ వేస్తున్నారు. దీంతో చెట్లకు గొడ్డలి వేటు తప్పడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వన మహోత్సవం పేరుతో గ్రామానికి 4,100 మొక్కలను నాటుతున్నారు. నాటిన మొక్కలను సంరక్షించి చెట్లుగా ఎదిగేలా చేస్తున్నప్పటికి చెట్లుగా మారిన తర్వాత నరుకుతున్నారు. దీంతో ప్రయోజనం లేకుండా పోతుంది. గతంలో మొక్కలను మేకలు, జంతువులు తిన్నా వాటి యజమానికి మొక్కకు రూ.500 చొప్పున జరిమానా విధించేవారు. ప్రస్తుతం చెట్లను నరికి వేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చెట్లను నరుకుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వన సంరక్షకులు వేడుకుంటున్నారు.



వేంపల్లిలో రోడ్డు పక్కన నరికేసిన చెట్లు

సురేష్‌రెడ్డికి సన్మానం

వేల్పూర్: బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నికై పార్లమెంటు సమావేశాల అనంతరం హైదరాబాద్ చేరుకున్న ఎంపీ, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డిని ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు.



సురేష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

సెలవుల్లో నిజామాబాద్ సౌత్ ఎఫ్‌ఆర్వో

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ సౌత్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్వో) రాధిక రెండు నెలల పాటు వ్యక్తిగత సెలవులు తీసుకున్నారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా ఇందల్వాయి ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.



కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న లీకేజీ నీరు



పంపు సెట్ ద్వారా నారు మడి వద్ద పోస్తున్న నీరు

లీకేజీ సంబరం దేఖోజీ..!

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా లీకేజీల రూపంలో 50 క్యూసెక్కుల నీరు కొనసాగుతుండటంతో అన్నదాతల్లో సంబురం నెలకొంది. కాకతీయ కాలువ యూటీకి మెండోరా మండల కేంద్ర శివారులో గండి పడటంతో లీకేజీ నీరు పూర్తిగా నిలిచి పోయింది. దీంతో అన్నదాతలు లీకేజీ నీటి కోసం ఆందోళనలు చేయడంతో యూటీ మరమ్మతులను నాలుగు రోజుల్లో పూర్తి చేశారు. దీంతో మళ్లీ లీకేజీ నీటి సరఫరా ప్రారంభమైంది. వరి నాట్లు వేయటానికి సకాలంలో నీరు అందడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సమీకృత బాలుర వసతి గృహం విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది గటడి ఆనంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణ గౌడ్, ప్రాజెక్టు చైర్మన్ జీవీ నర్సింహ రెడ్డి, సీనియర్ క్లబ్ సభ్యులు ముస్కు వెంకట్రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చార్జిషీట్ దాఖలులో నిర్లక్ష్యం



ఆర్మూర్‌టౌన్: గత సంవత్సరం నమోదైన కేసులో ఇప్పటి వరకు చార్జిషీట్ దాఖలు చేయకుండా ఆర్మూర్ పోలీసులు తనకు అన్యాయం చేస్తున్నారని పట్టణానికి చెందిన కౌన్సిలర్ బాదాం రాజ్‌కుమార్ ఆరోపించారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం తనకు ఆస్తి నష్టం కల్గించిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పోలీసులు సంబంధిత కేసులో చార్జిషీట్ దాఖలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ విషయంలో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆర్మూర్ పోలీసులు తన కేసు విషయంలో ఉన్నత అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

'ఓ భారతీయుడా' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



నందిపేటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో 'ఓ భారతీయుడా' అనే పుస్తకాన్ని బుధవారం ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో 1975 నుంచి 1977 వరకు విధించిన అత్యవసర పరిస్థితులకు సంబంధించిన విషయాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. అలాగే ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన పట్టణానికి చెందిన పుప్పాల రాజేందర్, శ్రీధర్, రవినాథ్‌లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, రూపాలి నర్సయ్య, యామాద్రి లింగన్న, సుమన్, సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లు..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఫొటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 26, 27, 28 తేదీలలో హైదరాబాదులో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని ఫొటో, వీడియో గ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని సభ్యులు కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, నందిపేట మండల సంఘ సభ్యులు కొడపాల ముత్యం, మన్నూర్ శ్యామ్, భూష రాజు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే, దాత బిగాల గణేశ్‌గుప్తా బుధవారం పరిశీలించారు. మొత్తం రూ.4కోట్ల 70లక్షల వ్యయంతో నిర్మాణ పనులు చేపడుతుండగా, బిగాల సోదరులు తమ వంతుగా రూ.కోటి విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పనులను పరిశీలించి ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, కేవలం ప్లంబింగ్, కిటికీలు, తలుపులకు సంబంధించిన పనులు మిగిలి ఉన్నాయన్నారు. త్వరలోనే పనులను పూర్తవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బిగాల వెంట మాజీ సర్పంచ్ రాజు, లక్ష్మీనారాయణ ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

వివాదాస్పద స్థలం పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో వివాదాస్పద శ్మశానవాటిక స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. అలాగే శ్మశానవాటికకు వెళ్లడానికి రోడ్డును సైతం నిర్మిస్తామని అన్నారు. నిజామాబాద్ గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నా రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విట్టం జీవన్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, తదితరులు పాల్గొన్నారు.



చేపూర్‌లో శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న వినయ్ రెడ్డి

'బకాయి వేతనాలు ఇప్పించండి'

నందిపేట్ (ఆర్మూర్): తమకు జీతాలు ఇవ్వాలంటూ నిజామాబాద్ జిల్లాలోని గుత్ప, అలీ సాగర్ లిఫ్ట్ నిర్వహణ కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం నందిపేట బస్టాండు నుంచి ర్యాలీగా బయలుదేరి ఐలమ్మ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని ఈ రెండు ఎత్తిపోతల పథకాల వల్ల వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని, కానీ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులో పనిచేసే కార్మికులకు మాత్రం 5 నెలల నుంచి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తూ వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. తాము పడుతున్న బాధలను ఎంతమంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తమ జీతాలను ఇప్పించి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.



నందిపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎత్తిపోతల పథకం కార్మికులు

భక్తి శ్రద్ధలతో మొహర్రం

జిల్లా వ్యాప్తంగా బుధవారం మొహర్రం పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రతిష్ఠించిన పీర్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం డప్పువాయిద్యాల మధ్య పీర్లను ఊరేగించారు. ఆనవాయితీగా బెల్లం, చక్కెర పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బోధన్‌లోని శక్కర్‌నగర్ కాలనీలో..



ఆర్మూర్ పట్టణంలో పీర్ల ఊరేగింపు



సాలూర మండల కేంద్రంలో దర్గాకు వెళ్తున్న ముస్లింలు

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	కల్కి-2898ఏడీ (తెలుగు) – 10.15, 2.00, 5.45, 9.30
స్క్రీన్-2 –	కల్కి -2898ఏడీ (3డీ తెలుగు) – 11.15, 3.00, 6.45, 10.30
స్క్రీన్-3 –	భారతీయుడు-2 (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	భారతీయుడు-2 (తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15

సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



భీమ్‌గల్: నియోజకవర్గంలోని ముగ్గురు సీనియర్ కాంగ్రెస్ నాయకులైన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కిసాన్ ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డిలతో పాటు పీసీసీ కార్యదర్శి తాహెర్ బిన్‌లకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం పట్ల పార్టీ మండలాధ్యక్షుడు బొదిరె స్వామి సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బుధవారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 19న వారికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ రమేష్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు.